


# 'గిరిఫెడ్' మంజూరు


- గంగారం, కొత్తగూడలో ఆదివాసీ సొసైటీల ఏర్పాటుకు శ్రీకారం
- సభ్యులకు రూ.5 లక్షల వరకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ
- ఎన్సీడీసీ నుంచి రూ.160 కోట్ల సబ్సిడీ మంజూరు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10సొసైటీల ఏర్పాటుకు ప్రతిపాదన
- వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి పొందనున్న గిరిజనులు



గంగారం మండలం కేంద్రం

4


# 'భూభారతి'కి సర్వే సంకటం!



- ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా సర్వేయర్ల కొరత
- కొత్త రెవెన్యూ చట్టంలో వారే కీలకం
- 78 మందికి 40 మందే విధులు
- ఏడీ కార్యాలయాల్లోనూ అదే పరిస్థితి
- ఉండాల్సింది 83మంది.. ఉన్నది 44మంది
- అరకొరగానే డిప్యూటీ సర్వేయర్లు.. డిప్యూటేషన్‌పై కొందరు ఇతర ప్రాంతాలకు
- కార్యాలయాల్లో కుప్పలు తెప్పలుగా సర్వే దరఖాస్తులు

**రిజిస్ట్రేషన్‌కు ముందే భూమి లెక్కలు, వివరాలు నిర్ధారించాలని నిబంధన**

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ప్రభుత్వం రెవెన్యూశాఖలో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతికి సర్వేయర్ల కొరత సవాల్‌గా మారనుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న ధరణిలో అనేక మార్పులు చేసి ప్రభుత్వం భూభారతిని అమల్లోకి తెస్తోంది. అయితే ఈ విధానంలో భూమి క్రయవిక్రయాలు జరిపే ముందు తప్పనిసరిగా భూసర్వే చేయాల్సి ఉంటుందని ప్రకటించింది. సర్వే పూర్తి చేస్తేనే రిజిస్ట్రేషన్ చేసేలా నిబంధనను తీసుకురాగా.. భూములను సర్వే చేసే సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాల్లోనూ సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ కార్యాలయాల్లో కుప్పలు తెప్పలుగా భూసర్వే కోసం వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో మూలుగుతున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూభారతితో భూ క్రయవిక్రయాలకు సర్వేయర్ల కొరత మరింత సమస్యగా మారనుంది.

### కొత్త విధానానికి వారే కీలకం...

ప్రభుత్వం రెవెన్యూ చట్టంలో అనేక మార్పులు తీసుకొచ్చింది. ధరణి స్థానంలో భూభారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. అనేక మార్పుల్లో అత్యంత కీలకమైంది భూ క్రయవిక్రయాలకు ముందే సర్వే నిర్వహించటం. కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం ప్రతీ భూమికి భూఆధార్ నెంబర్ ఇస్తున్నారు. దీంతో భూమి అమ్మే ముందు సదరు భూమిని సర్వే చేయించాలి. రికార్డు ప్రకారం భూఆధార్‌లో పేర్కొన్న విధంగా భూమి కొలతలు ఉన్నట్టు నిర్ధారిస్తూ సర్వేయర్ సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేస్తారు. భూముల క్రయవిక్రయాల్లో అవకతవకలు లేకుండా, పారదర్శకంగా భూములు అమ్మకాలు, కొనుగోళ్లు సాగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే ఈ విధానం బాగున్నా అమల్లోనే అసలు కష్టాలు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయాలతో పాటు జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాల్లో కూడా సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు, ఇతర సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో భూభారతిలో భూ క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశాలున్నాయనే ఆందోళన కనిపిస్తోంది.

### సర్వేకు నిరీక్షించాల్సిందే...

భూములు సర్వేకు సర్వేయర్ల కొరతతో రోజుల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఉమ్మడి వరంగల్ జిల్లాలో నెలకొంది. మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తగా సర్వేయర్ల నియామకాలు చేపట్టలేదు. ప్రతీ మండల రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్లు, సీనియర్ సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు, చైన్‌మెన్లు, ఇన్స్‌పెక్టర్లు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉంది. గతంలో భూములను కొలిచేందుకు ప్రత్యేకంగా సర్వేయర్ల వ్యవస్థ ఉండేది. వారు పదవీవిరమణ తరువాత కొత్తగా ఎవరినీ తీసుకోలేదు. దీంతో అన్ని మండలాల్లో సర్వేయర్ల కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 78మండలాలు ఉండగా, కేవలం 40మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారు. ప్రధానంగా ఏజెన్సీ జిల్లాల్లో సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉంది. భూపాలపల్లి జిల్లాలో మొత్తం 12మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా, కేవలం ముగ్గురు మాత్రమే ఉండగా, ఐదుగురు డిప్యూటీ సర్వేయర్లు ఉన్నారు. ములుగు జిల్లాలో 9మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా, కేవలం ఒక్కరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు డిప్యూటీలు ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 18మంది సర్వేయర్లు ఉండాల్సి ఉండగా, కేవలం ఏడుగురు మాత్రమే పని చేస్తున్నారు. డిప్యూటీ సర్వేయర్లు కేవలం ముగ్గురే పని చేస్తున్నారు. హనుమకొండ జిల్లాలో ఇద్దరు సర్వేయర్లు అదనపు బాధ్యతలతో పొరుగు మండలాల్లో విధులు నిర్వహించాల్సి వస్తోంది. వరంగల్ జిల్లాలో ముగ్గురు సర్వేయర్ల కొరత ఉంది. 13మందికి గాను కేవలం ఇద్దరు డిప్యూటీ సర్వేయర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 676 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వేయర్ల కొరతతో దరఖాస్తులతో రెవెన్యూ కార్యాలయాల చుట్టు బాధిత రైతులు చక్కర్లు కొడుతున్నారు. అత్యధికంగా ములుగు, జనగామ జిల్లాల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సర్వేయర్ల కొరతతో రైతులు సర్వే కోసం ఇబ్బందులు పడుతుంటే.. కొత్త చట్టం ప్రకారం క్రయవిక్రయాలు జరిగే ప్రతి భూమిని కొలత వేయ్యాలనే నిబంధనతో రిజిస్ట్రేషన్ ఆలస్యమయ్యే అవకాశం ఉంటుందనే చర్చ జరుగుతోంది.

**ఏడీ కార్యాలయాల్లో కొరత ఇలా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడీ కార్యాలయాల్లో ఇంకా 44 సర్వేయర్ల పోస్టులు ఖాళీగా వాటిలో వరంగల్‌లో 8, హనుమకొండలో 7, మహబూబాబాద్ 5, జనగామ 7, భూపాలపల్లి 7, ములుగులో 10 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



**ఉమ్మడి జిల్లాలో సర్వేయర్లున్నారిలా..**

| జిల్లా | మండలాలు | సర్వేయర్లు |
|---|---|---|
| వరంగల్ | 13 | 10 |
| హనుమకొండ | 14 | 12 |
| మహబూబాబాద్ | 18 | 01 |
| జనగామ | 12 | 07 |
| భూపాలపల్లి | 12 | 03 |
| ములుగు | 09 | 01 |
| మొత్తం | 78 | 40 |

### జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ ఆఫీసుల్లో సిబ్బంది కొరతే..

మండల, డివిజన్ రెవెన్యూ కార్యాలయాల్లోనే కాదు జిల్లా సర్వే అండ్ రికార్డ్స్ కార్యాలయాల్లోనూ ఉద్యోగులు, సిబ్బంది కొరత


మిగతా 5వ పేజీలో...


# విద్యార్థులు విజయాలు సాధించాలి

**కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్**



కేసముద్రం స్టేషన్ హైస్కూల్లో విద్యార్థులను ప్రశ్నిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి 16 వరకు ఆదిలాబాద్‌లో జరిగిన చెకుముకి రాష్ట్రస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మహబూబాబాద్ జిల్లా నుంచి పాల్గొని, ప్రథమ స్థానంలో నిలిచిన పెద్దవంగర మండలం చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను శుక్రవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అభినందించారు. చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్.లుకేష్, ఆర్.రవి, కీర్తన్, వి.వర్షిత్ బృందం ఆంగ్లమాధ్య విభాగంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. దీంతో కలెక్టర్ ఛాంబర్‌లో సదరు విద్యార్థులను అద్వైత్‌కుమార్‌సింగ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాహితి శ్రీనివాస్, చొప్పరి శ్రీనివాస్, ప్రతాపని మంగపతిరావు, చెకుముకి కన్వీనర్ ఆగుర్తి సురేష్, పాఠశాల హెచ్‌ఎం ఎ.విజయ్‌కుమార్, గైడ్ టీచర్ యుగేంధర్, ఎ.కోటేశ్వర్ పాల్గొన్నారు.

### స్కూళ్లు, పీహెచ్‌సీ, ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

కేసముద్రం (ఆంధ్రజ్యోతి) : మండలంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మికంగా పర్యటించారు. కల్వల మోడల్ స్కూల్, కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే ప్రాంతాలను పరిశీలించి, వంట మనుషులతో ఆయన మాట్లాడారు. శుభ్రత పాటిస్తూ నాణ్యమైన భోజనం వండాలని వారిని ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులను విషయ అవగాహనపై ప్రశ్నలు వేశారు. అనంతరం కేసముద్రం పీహెచ్‌సీలో రికార్డులను, మందుల నిల్వలను పరిశీలించారు. ప్రతీరోజు షెడ్యూల్ ప్రకారం వైద్యపరీక్షలు నిర్వహించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని సిబ్బందిని ఆదేశించారు. బేరువాడ, బోడమంచ్యాతండాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో వసతి గృహాలను, పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈవో రవీందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎర్రయ్య, ఎంపీడీవో క్రాంతి ఉన్నారు.

# అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

- మరిపెడ మునిసిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి

మరిపెడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అక్రమ కట్టడాలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయని మరిపెడ మునిసిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి హెచ్చరించారు. మరిపెడ బంగ్లాలోని రాంవిలాస్ గల్లీలో ఓవ్యక్తి 40 ఫీట్ల రోడ్డును ఆక్రమించి, దానిపై డ్రైనేజీ, మెట్లు నిర్మాణ పనులు చేపట్టగా, సిబ్బంది శుక్రవారం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాంవిలాస్ గల్లీ 40 ఫీట్ల రోడ్డు అని గుర్తుచేస్తూ, ఈ గల్లీలో ఎవరైనా మునిసిపల్ అనుమతి లేకుండా పనులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది


## కక్ష పూరిత ధోరణితోనే కేటీఆర్‌పై కేసులు

- ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల ఆరోపణ

6


# ప్రజల వినతులను వెంటనే పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా
- కొత్తగూడలో గిరిజన దర్బార్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న చిత్రామిశ్రా

కొత్తగూడ, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి స్వీకరించిన వినతులను వెంటనే పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అధికారులకు సూచించారు. కొత్తగూడలో శుక్రవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన దర్బార్ నిర్వహించారు. కొత్తగూడ, గూడూరు, బయ్యారం, గంగారం మండలాల నుంచి వచ్చిన ప్రజలు గిరిజన దర్బార్‌లో ఐటీడీఏకు 48 వినతులు సమర్పించారు. ఆర్‌వోఎఫ్ఆర్ కలిగిన ఉన్న భూములకు బ్యాంక్ రుణాలు ఇవ్వాలని, కొత్తగూడలో మరోబ్యాంక్ ఏర్పాటు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ ఆగబోయిన రవి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో ఏజెన్సీ చట్టాలను పరిగణంలోకి తీసుకోవాలని, గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు నిర్మించాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పూనెం సందీప్ కోరారు. కొత్తపలి, దుర్గారంలో సీసీ రోడ్డు మంజూరు చేయాలని కొత్తపల్లికి చెందిన సిద్ధబోయిన దేవేందర్, దుర్గారం గ్రామానికి చెందిన కల్తి సరేష్ విన్నవించారు. తిమ్మాపురంలో ఆరోగ్య సబ్‌సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. ముస్మితండాలో అంగన్‌వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని బానోత్ దేవేందర్ విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యూలర్ చేయాలని ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్ధబోయిన భిక్షం పేర్కొన్నారు. గిరివికాస కింద బోర్లు మంజూరు చేయాలని పలు గ్రామాల రైతులు కోరారు. తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, ఏటీడీవో భాస్కర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

# మునిసిపాలిటీగా కేసముద్రం




**1981లో 'కేసముద్రం స్టేషన్'గాను, 'కేసముద్రం విలేజి'గా విడిపోయి..**



- ఐదు గ్రామాలు, 19 వేల జనాభాతో ఏర్పాటు
- 43 ఏళ్ల క్రితం విడిపోయి కలుస్తున్న 'కేసముద్రాలు'
- రాష్ట్రనేత ప్రత్యేక చొరవతో వేగంగా ఆవిర్భావం

కేసముద్రం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండల కేంద్రాన్ని మునిసిపాలిటీగా రాష్ట్ర అసెంబ్లీ ప్రతిపాదించింది. ఈ మేరకు గురువారం అర్ధరాత్రి మునిసిపల్ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అసెంబ్లీలో నూతన మునిసిపాలిటీల ప్రతిపాదనను ప్రకటించారు. కేసముద్రం మునిసిపాలిటీ ఏర్పాటుకు ఈ నెల 9న పంచాయతీరాజ్‌శాఖ ద్వారా విలీన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, తీర్మానాలను చేసి ప్రభుత్వానికి పంపించారు. ఈ క్రమంలోనే ఫైలు వేగంగా కదిలి అసెంబ్లీలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే నూతన మునిసిపాలిటీల జాబితాలో కేసముద్రాన్ని చేర్చి, ఏర్పాటుకు ప్రతిపాదించడం గమనార్హం. ఇదే మండలానికి చెందిన రాష్ట్రస్థాయిలో కీలక నేత కేసముద్రం ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం, 133కేవీ, 33/11కేవీ సబ్‌స్టేషన్లు మంజూరు కాగా, త్వరలో పాలిటెక్నిక్ గురుకుల కళాశాల, 30 పడకల ఆస్పత్రి, అగ్నిమాపక కేంద్రం మంజూరుకానున్నట్లు సమాచారం.

కేసముద్రం మండలకేంద్రంలో రూ.25 కోట్లతో రోడ్ల విస్తరణ సెంట్రల్ లైటింగ్ మంజూరు చేయగా, పనులు సైతం ప్రారంభమయ్యాయి. మిగతా అన్ని మార్గాల్లో సెంట్రల్ లైటింగ్‌తో రోడ్ల విస్తరణ, ధన్నసరి క్రాస్‌రోడ్డు నుంచి ప్రభుత్వ కళాశాల వరకు నూతన బైపాస్‌రోడ్డు మంజూరుకానున్నట్లు సమాచారం. మునిసిపాలిటీ ఏర్పాటైతే మరింత అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని, ఈ దిశగా వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

ఈ క్రమంలోనే కేసముద్రంస్టేషన్, కేసముద్రం విలేజి, అమినాపురం, ధన్నసరి, ఎస్టీకాలనీ (సబ్‌స్టేషన్)తండా ఐదు గ్రామపంచాయతీలను కలుపుకొని మునిసిపాలిటీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలో మహబూబాబాద్, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ తర్వాత ఐదో మునిసిపాలిటీగా కేసముద్రం ఏర్పాటు కాబోతోంది.

కేసముద్రం మునిసిపాలిటీలో విలీనం అయ్యే ఐదు గ్రామాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 18 వేల జనాభా ఉండగా, 2023 ప్రకారం 19,438 అంచనా జనాభా ఉన్నట్లు ప్రభుత్వ రికార్డులు చూపుతున్నాయి. ఇందులో కేసముద్రం స్టేషన్‌లో 8,072 జనాభా ఉండగా, కేసముద్రం విలేజిలో 5,862, అమినాపురం 2,283, ధన్నసరిలో 2,214, సబ్‌స్టేషన్‌తండాలో 1,007 మంది ఉన్నారు. 43 ఏళ్ల క్రితం కేసముద్రం ఒకే గ్రామపంచాయతీగా ఉండగా 1981లో కేసముద్రం స్టేషన్'గాను, 'కేసముద్రం విలేజి'గాను విడిపోయి రెండు గ్రామపంచాయతీలుగా ఏర్పడ్డాయి. తాజాగా మునిసిపాలిటీ ఏర్పాటుతో మళ్లీ రెండు జీపీలు కనుమరుగై కేసముద్రం మునిసిపాలిటీగా మారనుండడం విశేషం. ఈ సారి సర్పంచ్ ఎన్నికలు మునిసిపాలిటీలో విలీనం అయ్యే ఐదు గ్రామ పంచాయతీల్లో ఉండబోవని అధికారులు చెబుతున్నారు.

ఇక ఎంపీటీసీలు, జడ్పీటీసీ ఎన్నికలు కూడా ఆయా గ్రామాల్లో ఉండవు. మరోవైపు ఉపాధి హామీ పనులు బంద్ అవుతాయని, ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో ఏర్పాటైన డోర్నకల్, మరిపెడలో మునిసిపాలిటీలు అభివృద్ధికి నోచుకోలేదని, ఇక్కడి విలీన గ్రామాల్లో మునిసిపాలిటీని వ్యతిరేకించిన వారు లేకపోలేదు. అయినప్పటికీ ఆయా గ్రామసభల్లో మెజార్టీ ప్రజల అభిప్రాయంతో మునిసిపాలిటీలో విలీనానికి అనుకూల తీర్మానం చేశారు. ఏదేమైనా ప్రముఖ పారిశ్రామిక కేంద్రంగా ఉన్న కేసముద్రం మునిసిపాలిటీగా రూపాంతరం చెంది రూ.వందల కోట్ల నిధులతో రాబోయే ఐదేళ్లలో ఊహించని రీతిలో అభివృద్ధి జరుగుతుందని అధికార పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రాహుల్‌గాంధీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

**బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంత్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఆరుట్ల దశమంత్‌రెడ్డి

తొర్రూరు రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో ఎన్డీయే ఎంపీలు నిరసన చేస్తుంటే.. దురుసుగా ప్రవర్తించి, సీనియర్ పార్లమెంట్ సభ్యుడు సారంగిని గాయపర్చిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆరుట్ల దశమంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అమ్మాపురం గ్రామంలో బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు సురేష్ అధ్యక్షతన నిర్వహించిన బూత్ కమిటీ ఎన్నికల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. అంబేద్కర్ పేరిట కాంగ్రెస్ చేసిన నీచరాజకీయాలను నిరసిస్తూ శాంతియుతంగా నిరసన చేస్తున్న ఎన్డీయే ఎంపీలు, మహిళను సైతం గౌరవించకుండా దురుసుగా ప్రవర్తించి ఎంపీ సారంగిని గాయపర్చిన కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీపై కేసు నమోదు చేసి, తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులేగా రాంమోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్, రంగు రాములు, దొంగరి మహేందర్, రచ్చ కుమార్, సుంకరనేని కోటేశ్వర్, పల్లె కుమార్, జిల్లా, మండల, శక్తికేంద్రాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

# పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య



చంద్రబాను(ఫైల్)

సీరోలు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందుతాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రేకులతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం. రేకులతండాకు చెందిన తేజావత్ చంద్రబాను(20) ఇంట్లో ఎవరులేని సమయంలో మిరపతోటకు కొట్టేందుకు ఇంట్లో ఉంచిన పురుగుల మందుతాగాడు. గమనించిన ఇంటి పక్కలవారు తల్లికి సమాచారం అందించారు. వెంటనే ఓ ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. చంద్రబానుకు తల్లి బూలి ఉన్నారు. ఇంట్లో ఇద్దరమే కదా ఉండేది పనిచేసుకుని బతకాలని తల్లి బూలి మందలించడంతో మనస్థాపానికి గురైన యువకుడు ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులు తెలిపారు. చంద్రబాను అవివాహితుడు. కాగా, గత రెండేళ్ల క్రితం చంద్రబాను తండ్రి చిన్న మృతి చెందాడని, నాటి నుంచి ఆయన మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని స్థానికులు తెలిపారు.

# దాడి కేసులో నలుగురికి నెల రోజుల జైలు శిక్ష

సీరోలు, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : ఒకరిని కొట్టిన కేసులో.. నలుగురికి నెల రోజుల జైలు శిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ.1500 మొత్తం రూ.6 వేలు జరిమానా విధిస్తూ ఈనెల 19న మహబూబాబాద్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తిరుపతి తీర్పు చెప్పినట్లు ఎస్సై నగేష్ తెలిపారు. శుక్రవారం ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోదుగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని జుజ్జురుతండాకు చెందిన ఇస్లావత్ రాజేందర్ తన పత్తి చేను చుట్టూ 2020లో ముళ్లకంచవేశారని తెలిపారు. ఇదే తండాకు చెందిన బానోతు కస్నా, పూల, పద్మ, కూలియాలు పత్తిచేనుకు వేసిన ముళ్ల కంచెను తొలగించి, ఆ చేనులో పశువులను మేపారని పేర్కొన్నారు. చేనులో ఎందుకు పశువులను మేపుతున్నారని అడుగగా దూషిస్తూ, అతన్ని కొట్టారని వివరించారు. అప్పటి ఎస్సై చంద్రమోహన్‌కు ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ వేశారని పేర్కొన్నారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.జయలత వాదించగా, కేసు పూర్వాపరాలను పరిశీలించిన మహబూబాబాద్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ తిరుపతి ఈనెల 19న తీర్పు ఇచ్చారని తెలిపారు. సదరు నలుగురు వ్యక్తులకు నెల రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున నాలుగురికి రూ. 6 వేలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. కోర్టు కానిస్టేబుల్ తాజీమ్‌ను ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అభినందించినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

## నేడు కేయూలో జాతీయ గణిత దినోత్సవం

కేయూ క్యాంపస్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీ గణిత విభాగం సెమినార్ హాల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు విస్తృత ఉపన్యాసం నిర్వహిస్తున్నట్లు గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్.భారవిశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస రామానుజం అయ్యంగార్ జయంతిని పురస్కరించుకుని వరంగల్ ఎన్ఐటీ గణిత శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఈ.సత్యనారాయణ 'డిఫ్రెన్షియల్ ఈక్వెటెన్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' అనే అంశంపై విస్తృత ఉపన్యాసం చేస్తారని వెల్లడించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు హాజరు కానున్నట్లు భారవిశర్మ తెలిపారు. విద్యార్థులు, స్కాలర్లు హాజరు కావాలని కోరారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి : ఏసీపీ



జనగామ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఏసీపీ పార్థసారథి

జనగామ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలగాలని జనగామ ఏసీపీ పార్థసారథి అన్నారు. శుక్రవారం జనగామ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులు, పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించి కేసుల పురోగతి వివరాలను అడిగి తెలుకున్నారు. ఏసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సైబర్ మోసాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీఐ దామోదర్‌రెడ్డి ఎస్సైలు రాజేశ్‌కుమార్, చెన్నకేశవులు, శ్వేత పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జనగామ కల్చరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి వారిని రెగ్యులరైజ్ చేయాలని రిటైర్డ్ డీఈవో, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏలె చంద్రమోహన్ అన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక నిరాహర దీక్షలు శుక్రవారం 11వ రోజుకు చేరుకోగా, ఉద్యోగులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగుల దీక్షల శిబిరాన్ని చంద్రమోహన్ సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. గత సంవత్సరం పీసీసీ హోదాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ అధ్యక్షుడు తాడూరి రమేష్, బైరగోని దయాకర్, గోలి రవీందర్‌రెడ్డి, శ్రీలత, శ్రీనివాస్, రాణి, రమ్య, మహాలక్ష్మి, అన్నపూర్ణ, మమత పాల్గొన్నారు.

## రోడ్డుపై కోతులు.. అదుపుతప్పిన ద్విచక్రవాహనం

- ఖద్రాద్రి జిల్లా మహిళకు తీవ్ర గాయాలు
- వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన నాగమణి

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై కోతులను చూసి భయంతో వెళ్తున్న ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ఘటనలో ఓమహిళకు తీవ్ర గాయాలైన ఘటన శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాదెవాగు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచ గ్రామానికి చెందిన నాగమణి తన భర్తతో కలిసి కొత్తగూడ, నర్సంపేట మీదుగా ద్విచక్ర వాహనం పై వరంగల్ వెళ్తున్నారు. గాదెవాగు సమీపంలోకి రాగానే రోడ్డుపై ఉన్న కోతుల గుంపును చూసి భయంతో ముందుకు వెళ్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పి ద్విచక్ర వాహనం కిందపడింది. ఈ ఘటనలో నాగమణికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సాయంతో ఆమె భర్త వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.



# 'గిరిఫెడ్' మంజూరు

- గంగారం, కొత్తగూడలో ఆదివాసీ సొసైటీల ఏర్పాటుకు శ్రీకారం
- సభ్యులకు రూ.5లక్షల మేర ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ
- ఎన్సీడీసీ నుంచి రూ.160 కోట్ల సబ్సిడీ మంజూరు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10 సొసైటీలు ఏర్పాటుకు ప్రతిపాదన
- వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి పొందనున్న గిరిజనులు



గంగారం మండల కేంద్రం

గంగారం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లాలోని గంగారం మండలానికి నీతి అయోగ్ ప్లానింగ్ కమిషన్ సూచన మేరకు కేంద్రప్రభుత్వం 'గిరిఫెడ్' మంజూరు చేసింది. ఈ సొసైటీ సభ్యులకు ప్రభుత్వమే ఉచితంగా విత్తనాలు ఎరువులు పంపిణీ చేయనుండగా.. రైతులు వడ్డీ వ్యాపారుల చేతిలో మోసపోకుండా బయటపడనున్నారు. అందుకు గాను ఎన్సీడీసీ నుంచి రూ.160కోట్ల నిధులు సబ్సిడీ కింద గిరిఫెడ్‌కు మంజూరు చేస్తూ ఆమోదం తెలిపింది. దీంతో ఏజెన్సీలో గంగారం గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

రాష్ట్రం నుంచి మహబూబాబాద్ జిల్లాలో వెనుకబడిన మండలమైన గంగారాన్ని గతేడాది కేంద్ర ప్రభుత్వం నీతి అయెగ్‌గా ఎంపిక చేసింది. ఈ పథకంలో అధికారులు మండలాన్ని విద్య, వైద్యం, పోషకాహారం, వ్యసాయం, తాగునీరు, సాగునీరుతో పాటు గిరిజన మహిళలను చైతన్య పర్చాల్సి ఉంది. ఒక వ్యవసాయం మినహా అన్ని రంగాలలో గిరిజనులు కొద్దోగొప్పో అభివృద్ధి కనిపించినా.. వ్యవసాయ పరంగా వందలాది ఎకరాలు ఉన్నా రైతుల అభివృద్ధి కానరాకపోవటంపై స్పందించిన నీతి అయోగ్ ప్లానింగ్ కమిషన్ అధికారులు మండలంలోని 19 గ్రామాలలో గిరిజనుల ప్రధాన పంట అయిన మొక్కజొన్న సాగు, దిగుబడులు, ఆదాయంపై ప్రతీ గిరిజనుడితో సర్వేలు చేసి వివరాలు సేకరించారు. గిరిజనులు వ్యవసాయం చేయాలంటే ఎరువుల వ్యాపారుల నుంచి వడ్డీకి తెస్తేనే సాధ్యమని గుర్తించటం జరిగింది. గిరిజనులు వ్యవసాయ పరంగా కష్టపడినా ప్రయోజనం దక్కటం లేదని, ఏటా పండించిన పంట అంతా వడ్డీతో సహా వ్యాపారులకే చెల్లిస్తున్నామని గిరిజనులు అధికారులకు చెప్పటంతో వ్యాపారుల నుంచి రైతులను ఆదుకు నేందుకు నీతి అయెగ్ అధికారులు ఉమ్మడి మండలాలైన గంగారం, కొత్త గూడను కలిపి గిరిఫెడ్ ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కేంద్రానికి నివేదికలు పంపారు.

కేంద్రంప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి పది గిరిజన ఆదివాసీ సొసైటీలకు అనుమతి ఇస్తూ.. హైదరాబాద్ రాజధాని కేంద్రంగా గిరిఫెడ్ మంజూరు చేసింది. ఈ గిరిఫెడ్ ద్వారా గిరిజనులు గిరిజన కోఆపరేటీవ్ ఫెడరేషన్ ఏర్పాటు చేసుకుని సభ్యులుగా చేరాల్సి ఉంటుంది. మండలానికి ఒక బ్లాక్ చొప్పున గిరిజనుల సమైఖ్యను ఏర్పాటు చేసిన అధికారులు ఒక్కో రైతుకి ఏడాదికి రూ. ఐదు లక్షల వరకు అవసరం అయిన ఎరువులు పురుగు మందులు విత్తనాలను వడ్డీ లేకుండా ఇస్తారు. ఇలా గిరిఫెడ్ నుంచి అప్పు తీసుకున్న రైతు పండించిన పంటను ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకే తిరిగి గిరిజన సొసైటీ కొనుగోలు చేసి రైతు ఎకౌంట్ లో నిధులు జమ చేస్తారు. దీంతో గిరిజనులు ఎరువుల వ్యాపారులను ఆశ్రయించే అవసరం ఉండదని నీతి అధికారులు చెప్తున్నారు.

**స్థల సేకరణ..**

గిరిఫెడ్ ఏర్పాటుకు అవసరమైన స్థలం కోసం నీతి అయోగ్ అధికారులు స్థలం సేకరణలో నిమగ్నమైయ్యారు. కార్యాలయంతో పాటు రైతులు సమావేశానికి అవసరమైయ్యే వేదికతో పాటు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను నిల్వ ఉంచేందుకు అవసరమైన స్థలం (పది ఎకరాలు పైన) కోసం సర్వే చేస్తున్నారు.

### ఇంటర్ నెట్ సౌకర్యం కూడా ఉండాలి..

జిల్లాలో బాగా వెనుక బడిన మండలమైన గంగారంలో ఇంటర్‌నెట్ సౌకర్యాలు అరకొర మాత్రమే. 'ఆన్‌లైన్' సౌకర్యం లేకపోవటంతో ఆన్‌లైన్ సౌకర్యం ఉన్న కొత్తగూడలో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలలో అధికారులు ఉన్నారు.

### అటవీ ఉత్పత్తులనూ కొనుగోలు..

గిరిజన కోఆపరేటీవ్ సొసైటీ వారు గిరిజనులు అడవుల్లో సేకరించే అటవీ ఉత్పత్తులు అయిన తేనె, చీపుర్లు, జిగురు, ఇప్పబద్దలు, ఇప్పపువ్వు, చింతగింజలు, చింతపండు, చిల్లగింజలు, కరక్కాయలు, విషముష్టి గింజలు, పారటాకు (ఇస్తారాకు)లు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేసి, రైతులను ఆదుకుంటామని నీతి అయెగ్ అధికారులు తెలిపారు.

**వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి పొందనున్న ఏజెన్సీ గిరిజనులు**

ఉమ్మడి మండలాలైన గంగారం, కొత్తగూడకు గిరిఫెడ్ కు అవసరమైన స్థలం దొరికితే ఈ ప్రాంత గిరిజనులు వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి పొందినట్టేనని హర్షం వ్యక్తం చేస్తున్నారు. గంగారం మండలంలో 19 గ్రామాలలో సుమారు 25 నుంచి 30 వరకు చిన్నా చితకా ఎరువులు, పురుగుమందుల షాపు లు ఉన్నాయి. ప్రతీ గిరిజనుడు ఆ ఎరువుల వ్యాపారులు ఇచ్చే అప్పుపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తుంటారు. తరతరాలుగా వడ్డీకి తెచ్చి వ్యవసాయం చేయటంతో గిరిజనులు పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాగా మారింది. ఈ గిరిజన సొసైటీల వలన వడ్డీ వ్యాపారుల నుంచి గిరిజనులకు విముక్తి పొందే సువర్ణ అవకాశం దక్కుతుందనే చెప్పాలి.

### సీబీఐ అధికారులమంటూ

## ఫేక్ కాల్

జనగామ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'నేను సీబీఐ అధికారిని మాట్లాడుతున్నాను. మీరు, మీ కుటుంబసభ్యులు, ఎక్కడ ఉంటారో ఏమి చేస్తారో అన్నీ మాకు తెలుసు' అంటూ బెదిరింపులకు గురిచేస్తూ జనగామ వైద్యాధికారి డాక్టర్ కల్నాల్ మాచర్ల భిక్షపతికి శుక్రవారం ఒక ఫేక్ కాల్ వచ్చింది. డబ్బులు ఇవ్వాలని సదురువ్యక్తి డిమాండ్ చేయడానికి ప్రయత్నించగా, తాను ఆర్మీలో కల్నల్‌గా పని చేశానని నీ చరిత్ర మొత్తం బయట పెడుతానని ఎదురు ప్రశ్నించడంతో ఫోన్ కట్ చేశాడు.అనంతరం భిక్షపతి మాట్లాడుతూ సీబీఐ అధికారి అంటూ బెదిరించిన వ్యక్తి ట్రూ కాలర్‌లో పోలీసు అధికారిలా డ్రెస్ వేసుకున్న డీపీ పెట్టుకొని +923112127295 నంబరు నుంచి ఫోన్ కాల్ చేయడం జరిగిందని తెలిపారు. గతంలో కూడా తమకూతురిని డ్రగ్స్ కేసులో పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించడం జరిగిందని చెప్పి డబ్బులు డిమాండ్ చేయడానికి కూడా ప్రయత్నించారని తెలిపారు. జనగామ జిల్లాకు చెందిన ఓ ఇద్దరు అధికారులను కూడా ఇటీవల ఏసీబీ అధికారులమంటూ మోసగాళ్లు డబ్బులు డిమాండ్ చేశారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి ఎవరైనా వ్యక్తులు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

## తప్పులు దొర్లకుండా సర్వే నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను తప్పులు దొర్లకుండా నిర్వహించాలని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తెలిపారు. శుక్రవారం ఘన్‌పూర్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాపాలన దరఖాస్తుల్లో నమోదు చేసుకున్న కుటుంబాల వివరాల ఆధారంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి సిబ్బంది సర్వేను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈవో చుక్క లింగయ్య, సిబ్బంది మంజుల, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

## ఉద్యమకారులను పట్టించుకోని గత ప్రభుత్వం




సమావేశమైన వేదిక ప్రతినిధులు

దేవరుప్పుల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో గత ప్రభుత్వం నియంత పాలన కొనసాగించిందని, రాష్ట్రం సిద్ధించడానికి కారణమైన ఉద్యమకారులను పట్టించుకోలేదని తెలంగాణ ఉద్యమ కారుల ఆకాంక్షల వేదిక రాష్ట్ర చైర్మన్ కుమారస్వామి ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం దేవరుప్పులలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. పాలకుర్తి నియోజక వర్గ కన్వీనర్ పులిగిళ్ల యాకయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుమారస్వామి మాట్లాడుతూ తెలంగాణ పోరాటానికి వ్యతిరేకంగా పని చేసిన వ్యక్తులను అందలం ఎక్కించి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఉద్యమకారులను గుర్తించి 250 గజాల స్థలంతో పాటు పెన్షన్ ఇస్తాననీ ప్రకటించడంతో ఉద్యమకారులు, సబ్బండ వర్గాలు స్వాగతించాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీని పరిష్కరించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గడ్డం సదానందం తదితరులు హాజరయ్యారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కత్తుల సుధాకర్, కార్యదర్శిగా జక్కి నర్సయ్య, సహాయ కార్యదర్శిగా జోగు రవి, సభ్యులుగా మరాటి యాదగిరి, గొడిషాల రాములు, మూఢ రమేష్, మేడ చిరంజీవి ఎన్నికయ్యారు.

## 27 నుంచి 30 వరకు లావాదేవీలు ఉండవు

- బ్యాంకు సేవలను 27 లోపే పూర్తి చేసుకోవాలి
- ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) :ఏపీజీవీబీ బ్యాంకు లావాదేవీలు కస్టమర్లకు ఈనెల 27 నుంచి 30 వరకు అందుబాటులో ఉండవని కస్టమర్లు బ్యాంకు సేవలను ఈ నెల 27లోపే పూర్తి చేసుకోవాలని ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ఏపీజీవీబీ జోనల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు వన్ స్టేట్ వన్ ఆర్ఆర్‌బీ లక్ష్యంలో భాగంగా ఏపీజీవీబీ బ్యాంకులను టీజీబీ బ్యాంకులో విలీనం చేస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంకు సంబంధించిన 493 శాఖలను గ్రామీణ బ్యాంకు టీజీబీలో విలీనం కానున్నట్లు తెలిపారు. 2025 జనవరి 1 నుంచి టీజీబీ హెడ్ ఆఫీస్ హైదరాబాద్‌లోనే ఏపీజీవీబీ బ్రాంచ్‌లు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా తలెత్తే సాంకేతిక కారణంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్ సర్వీస్‌లు ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ సేవలు ఈనెల 27 నుంచి 31 వరకు అందుబాటులో ఉండవన్నారు. కస్టమర్లు ఈనెల 27వ తేదీలోగా తమ లావాదేవీలు పూర్తి చేసుకోవాలని కస్టమర్లకు విజ్ఞప్తి చేశారు. 2025 జనవరి 1 నుంచి బ్యాంకు సర్వీస్‌లు యథావిధిగా నడుస్తాయన్నారు. ఖాతాదారుల నంబర్లు అలాగే ఉంటాయని ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ ఆపరేషన్ బి. దయాకర్, కోఆర్డినేటర్లు శశికాంత్ పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను అరెస్టు చేస్తే ఊరుకునేది లేదు

- మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, సుదర్శన్‌రెడ్డి, నరేందర్, ధర్మారెడ్డి

హనుమకొండ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేటీఆర్‌ను అరెస్టు చేస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్‌లు అన్నారు. ఫార్ములా-ఈ రేస్ నిర్వహణలో అవినీతి జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే కేటీఆర్‌ను అరెస్టు అంటూ అసత్య ప్రచారాలతో కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం బురద జల్లే ప్రయత్నం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నందుకే కేటీఆర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా ఆరు గ్యారంటీలు అమలు మర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే గల్లీ నుంచి ధర్నా, రాస్తారోకో చేస్తామన్నారు.

పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ వలనే దేశంలోనే హైదరాబాద్ నగరంలో ఈ రేస్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. రూ. 55 కోట్లు నేరుగా హెచ్ఎండీఏ ద్వారా ఫార్ములా ఈ రేస్ సంస్థకు చెల్లింపులు జరిగినట్లు కేటీఆరే చెప్పారన్నారు. అసలు నిందితుడు సీఎం రేవంత్‌రెడ్డేనని ఫార్ములా ఈ రేస్ విషయంలో ఆ సంస్థకు చెందిన వ్యక్తిని రేవంత్‌రెడ్డి కలిసిన విషయాన్ని ప్రభుత్వం ఎందుకు దాచిందో చెప్పాలన్నారు.

చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్‌ను అరెస్టు చేస్తే తెలంగాణలో మరో ఉద్యమం ఎగిసిపడుతుందన్నారు. ప్రతీ మూడు నెలలకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త అంశాన్ని తెరపైకి తెస్తూ ప్రజలను డైవర్ట్ చేస్తున్నారని విమర్శించారు. నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ చంద్రబాబు వెంచాగా ఉండి నాడు ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి పెరిగిందన్నారు. జిల్లాలో కాంగ్రెస్ నాయకులు, మంత్రులు కబ్జాలకు పాల్పడుతున్నట్లు విమర్శించారు.

ఈ సమావేశంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవ్‌రెడ్డి, బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేడిపల్లి శోభన్‌బాబు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు మెడికల్ కళాశాలలో వైట్‌కోట్ సెర్మనీ




వైట్‌కోట్ సెర్మనీలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

ములుగు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ములుగు ప్రభుత్వ వైద్యకళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బానోతు మోహన్‌లాల్ ఆధ్వర్యంలో శుక్రవారం వైట్‌కోట్ సెర్మనీ ఘనంగా జరిగింది. కళాశాలలో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందిన మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేశారు. అనాటమీ హెచ్‌వోడీ డాక్టర్ దీపిక పర్యవేక్షణలో కెడావరిక్ వోత్(శవప్రమాణ వేడుక) కూడా నిర్వహించారు. శరీర దాన ఆవశ్యకతను చెప్పే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో సీనియర్ ప్రొఫెసర్ వి.చంద్రశేఖర్, ఫార్మాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాజుదేవడే, సీనియర్ ప్రొఫెసర్‌లు డాక్టర్ గీత, వాణిశ్రీ, స్వప్న, మాధవీలత, ఏరియా వైద్యశాల ఆర్ఎంవో ప్రవీణ్‌రెడ్డి, ట్యూటర్, సదాశ ఫౌండేషన్ ప్రతినిధులు టి.శ్రావణ్ కుమార్, ఎస్.వేణుమాధవ్, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్‌పై కేసు

- మాజీ మంత్రి రెడ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్.రెడ్యానాయక్

మరిపెడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి కేటీఆర్‌పై ఫార్ములా ఈ రేస్ కేసు నమోదు చేయించారని మాజీ మంత్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ ఖండించారు. చేయని నేరానికి కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే సీఎం రేవంత్‌రెడ్డికి మూడినట్లేనని ఆయన అన్నారు. శుక్రవారం రెడ్యానాయక్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నవీన్‌రావు గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీ పెంచేందుకు ఆ నగరపాలక సంస్థ అగ్రిమెంట్ మేరకు ఫార్ములా ఈ రేస్ పోటీలకు రూ.55కోట్లు చెల్లించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలప్పుడు చెప్పిన విధంగా మహాలక్ష్మీ పథకం, పెన్షన్ల రొక్కం పెంపు, కల్యాణలక్ష్మీ రూ.లక్షతో పాటు తులం బంగారం, 2 లక్షల ఉద్యోగాల భర్తీ, రైతు భరోసా, భూమిలేని కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, రెండు లక్షల రుణ మాఫీ అని ఇంకెన్నో ఉచిత హామీలు ఇచ్చి 2023 డిసెంబరు 9లోపు అమలు చేస్తానని హామీ ఇచ్చారన్నారన్నారు. ఆ హామీ ఏడాది దాటినా ఆ పథకాల అమలుకు ఉలుకుపలుకు లేకపోవడంతో బీఆర్ఎస్ నాయకత్వం ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలనపై పట్టులేక కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి ప్రజల మనస్సు మళ్లించే కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. ఓ జర్నలిస్ట్‌కు రూ.83వేల బ్యాంకు అప్పు ఉంటే మాఫీ కాక ఆయన దీక్షకు దిగిన విషయాన్ని ఉదహరించారు. ఇప్పటికి ఇప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీ 100సీట్లకు పైగా గెలుస్తుందని గుర్తుచేశారు. ఈ సమావేశంలో నవీన్‌రావు, మాజీ ఎంపీపీ వెంకన్న, రాంబాబు, రవీందర్, తాళ్లపల్లి రఘు, దిగిజర్ల శ్రీనివాస్, దస్రు నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## 24న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో 24న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్‌లో వివిధ ఉద్యోగాల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డీ, బీ ఫార్మసీ ఉత్తీర్ణులై, 18 నుంచి 30 సంవత్సరాల మధ్య గల వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ, యువకులు వారి జీరాక్స్ సర్టిఫికేట్లతో మంగళవారం ఉదయం 11 గంటలకు ములుగు రోడ్‌లోని జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7893394393 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

## వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| మక్కలు (బిల్టీ రకం) | - | - |
| పల్లికాయ (సూక) | 3100 | 3000 |
| పల్లికాయ (పచ్చిది) | 4600 | 4500 |
| కందులు | - | - |
| పెసళ్లు | 7560 | 4000 |
| పత్తి | 6980 | 5800 |
| పసుపు (కాడి) | - | - |
| పసుపు (గోల) | - | - |
| తేజ మిర్చి | 12000 | 9000 |
| తేజ మిర్చి (కొత్తది) | 15500 | 12000 |
| తేజ ఏసీ | 15000 | 14000 |
| వండర్‌హాట్ ఏసీ | 14500 | 13000 |
| యూఎస్341ఏసీ | 14000 | 11000 |
| దేశీ ఏసీ | - | - |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 7000 | 3000 |

- వరంగల్ వ్యవసాయం

# అంగరంగ పెళ్లిళ్లపై ఐటీ చూపు

న్యూఢిల్లీ, డిసెంబరు 20: భారీ సెట్టింగు.. డెస్టినేషన్ వెడ్డింగ్.. సినీ తారల సందడి.. కోట్లు ఖర్చు అయినా వెనుకాడకుండా ఆతిథ్యం.. ఇలా అంగరంగ వైభోగంగా జరిగే పెళ్లిళ్లపై ఆదాయ పన్ను శాఖ దృష్టి పెట్టింది. పన్ను లెక్కల్లో చూపని నగదును ఈ కల్యాణాల్లో ఖర్చు చేస్తున్నట్లు పసిగట్టింది. ఇలాంటి డబ్బు గతేడాది కాలంలో రూ. 7,500 కోట్లకుపైగా ఖర్చు పెట్టారని లెక్కగట్టింది. ఆ విలాసవంతమైన వెడ్డింగ్‌లకు జైపూర్ కేంద్రమని గుర్తించిన ఆదాయ పన్ను అధికారులు.. ఇక్కడి టాప్ 20 వెడ్డింగ్ ప్లానర్ల లెక్కలు బయటకు తీస్తోంది. వీరిని ఇతర ప్రాంతాల వెడ్డింగ్ ప్లానర్లు సంప్రదిస్తారని అధికారులు గుర్తించారు. జైపూర్‌లో భారీ పెళ్లిళ్ల కోసం మ్యూల్ ఖాతాలు, హవాలా ఏజెంట్లు, నకిలీ బిల్లుల సృష్టి కర్తలతో కూడిన ఓ నెట్‌వర్క్ పనిచేస్తోందని, ఈ నెట్‌వర్క్‌కు హైదరాబాద్, బెంగళూరు లాంటి నగరాల్లోని సహచరులతో సంబంధాలు ఉన్నాయని కనిపెట్టారు.

## హరియాణా మాజీ సీఎం చౌతాలా కన్నుమూత



చండీగఢ్, డిసెంబరు 20: హరియాణా మాజీ సీఎం, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ చౌతాలా(89) కన్నుమూశారు. గురుగ్రామ్‌లోని నివాసంలోనే ఆయన గుండెపోటుతో శుక్రవారం తుది శ్వాస విడిచారు. మాజీ ఉప ప్రధాన మంత్రి దేవీలాల్ పెద్ద కొడుకైన చౌతాలా అయిదు సార్లు హరియాణా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. చౌతాలా మృతి పట్ల ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చౌతాలా మృతి నేపథ్యంలో హరియాణా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు శనివారం సెలవు ప్రకటించింది. అలాగే శుక్రవారం నుంచి మూడురోజులు సంతాప దినాలుగా ప్రకటించింది.

# అమెరికాకు 'ఘోస్ట్ గన్స్' తలనొప్పి!



» పెరిగిపోతున్న త్రీడీ ముద్రిత తుపాకుల సంస్కృతి

తుపాకుల సంస్కృతి అమెరికాకు కొత్త కాదు! తరచుగా ఎక్కడో ఒకచోట కాల్పుల ఘటనలు జరుగుతూనే ఉంటాయి. అలాంటి దేశాన్నే ఇప్పుడు 'త్రీడీ ప్రింటెడ్' తుపాకుల విస్తృతి తీవ్రంగా భయపెడుతోంది. చూడ్డానికి పిల్లలు ఆడుకునే బొమ్మల్లా ఉండే ఈ తుపాకులు అగ్రరాజ్యానికి తలనొప్పిగా మారాయి. ఉదాహరణకు.. ఈ నెల 4వ తేదీన అమెరికాలో యునైటెడ్ హెల్త్‌కేర్ సీఈవో బ్రియాన్ థాంప్సన్.. కాల్పుల్లో చనిపోయారు గుర్తుంది కదా! ఆ హత్యకు నిందితుడు వాడింది త్రీడీ ప్రింటెడ్ తుపాకీనే. అదొక్కటే కాదు.. ఇటీవలికాలంలో అమెరికాలో జరిగిన పలు హై-ప్రొఫైల్ నేరాల్లో నిందితులు ఇంట్లోనే త్రీడీ ప్రింటర్ల సాయంతో ముద్రించిన ఆయుధాలను వాడినట్టు తేలడం పోలీసులను కలవరపెడుతోంది. దుకాణంలో కొన్న తుపాకులకు ఒక లెక్కాపత్రం ఉంటాయి! ఇంట్లో త్రీడీ ప్రింటర్ పెట్టి దాంట్లో ఆయుధాలను/తుపాకులను ముద్రించి నేరాలకు పాల్పడితే వాటిని గుర్తించడం కూడా కష్టమే కదా! అందుకే ఈ తుపాకులను అమెరికా పోలీసులు 'ఘోస్ట్ గన్స్'గా వ్యవహరిస్తున్నారు. చాలా కేసుల్లో ఘోస్ట్ గన్స్ వాడినట్టు తేలడంతో అమెరికా సుప్రీంకోర్టు కూడా ఈ సమస్యపై దృష్టి సారించింది. ఈ సమస్య ఒక్క అమెరికాకే కాదు.. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలకు ఉంది. నిజానికి త్రీడీ ముద్రిత తుపాకీకి సంబంధించి ప్రపంచంలో తొలి క్రిమినల్ కేసు యూకేలో 2013లో నమోదైంది. అప్పటి నుంచి యూరప్‌లోని వ్యవస్థీకృత నేర ముఠాల నుంచి మయన్మార్‌లో తిరుగుబాటుదారుల దాకా.. జిహాదీలు, వామపక్ష తీవ్రవాదులు, మితవాదులు, జాతిపరమైన వేర్పాటువాదులు.. ఇలా అందరి దృష్టీ వీటిపైకి మళ్లింది. యూరప్‌లో 2013-2024 నడుమ త్రీడీ ప్రింటెడ్ ఆయుధాలకు సంబంధించి 165 కేసులు నమోదయ్యాయి. అందులో 15% కేసులు ఉగ్రవాదానికి సంబంధించినవి. తుపాకులు కలిగి ఉండడం చట్టబద్ధమైన అమెరికాలో అయితే.. వీటి వినియోగం ఆందోళనకరస్థాయికి పెరిగిపోయింది. యూఎస్ బ్యూరో ఆఫ్ ఆల్కహాల్, ఫైర్ఆర్మ్స్ అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ గణాంకాల ప్రకారం.. 2017-21 నడుమ అక్కడి దర్యాప్తు సంస్థలు 38 వేల ఘోస్ట్ గన్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా త్రీడీ ముద్రిత తుపాకులకు సంబంధించి అరెస్టుల సంఖ్య కూడా పెరుగుతోంది. 2022లోఅన్ని దేశాల్లో కలిపి ఈ తరహా కేసుల్లో 66 మంది అరెస్టయ్యారు.

### అదానీపై ఆరోపణల వెనుక ఉన్న అమెరికా అటార్నీ రాజీనామా?

వాషింగ్టన్, డిసెంబరు 20: అదానీ గ్రూప్ సంస్థల అధినేత గౌతమ్ అదానీపై కేసు నమోదు వెనుక ఉన్న అమెరికా అటార్నీ బ్రియాన్ పీస్ జనవరి 10న తన పదవికి రాజీనామా చేయనున్నారు. అమెరికా అటార్నీ కార్యాలయం తాజాగా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. న్యూయార్క్‌లోని ఈస్టర్న్ డిస్ట్రిక్ట్‌కు ఆయన అటార్నీగా వ్యవహరిస్తున్నారు. 53 ఏళ్ల బ్రియాన్ పీస్‌ను 2021లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆయనను న్యూయార్క్ ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ అటార్నీగా నియమించారు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వ కాంట్రాక్టులు పొందేందుకు లంచాలు ఇవ్వడానికి అమెరికాలోని పెట్టుబడిదారుల నిధులను అదానీ గుట్టుచప్పుడు కాకుండా మళ్లించారని ఈ ఏడాది నవంబరులో బ్రియాన్ పీస్ కార్యాలయం అభియోగాలు మోపింది.

#### ఎందుకు ప్రమాదం?

చట్టబద్ధంగా ఎవరైనా తుపాకీ కొంటే.. దాని సీరియల్ నంబర్, ఎవరు కొన్నారు? ఎప్పుడు కొన్నారు? లాంటి వివరాలన్నీ అధికారుల డేటాబేస్‌లో ఉంటాయి. కాల్పుల ఘటనలు జరిగినప్పుడు కొద్దిపాటి దర్యాప్తుతో నేరగాళ్లను గుర్తించే అవకాశం ఉంటుంది. అలా కాకుండా ఎవరికివారు ఇంట్లో ప్రింటర్ పెట్టి ప్రింటవుట్ తీసినంత సులభంగా ఆయుధాలు ముద్రించేసుకుంటే వాటిని గుర్తించడం పోలీసులకు అసాధ్యం అవుతుంది. ఈ ముప్పును గుర్తించే జపాన్, కెనడా, యూరోపియన్ దేశాలు త్రీడీ ప్రింటెడ్ తుపాకులపై నిషేధం విధించాయి.



మీడియాతో మాట్లాడుతున్న సాయిదివ్య

## పీఎస్ఎల్వీ-సీ60లో స్వేచ్ఛశాట్ పేలోడ్

తెనాలి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులో పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా స్పాడెక్స్ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపేందుకు ఇస్రో సన్నద్ధమవుతోంది. శ్రీహరికోట నుంచి చేపట్టే ఈ ప్రయోగంలో తెనాలికి చెందిన ఎన్ స్పేస్ టెక్ సంస్థ భాగస్వామ్యం కానుంది. ఇస్రో సహకారంతో యుహెచ్ఎఫ్ కమ్యూనికేషన్ మాడ్యూల్‌కు సంబంధించి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అతి చిన్న స్వేచ్ఛశాట్-వీ.0 పేలోడ్‌ను పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నట్లు ఎన్ స్పేస్ టెక్ సంస్థ వ్యవస్థాపకురాలు, ఏపీలోని గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొత్తమాసు సాయిదివ్య శుక్రవారం తెలిపారు. తమ మాడ్యూల్‌కు సంబంధించి భూమిపై చేసిన పరీక్షలన్నీ విజయవంతమయ్యామని, ఉపగ్రహం కక్ష్యలోకి చేరాక తాము పంపిన మాడ్యూల్ ఇస్రోకు సంకేతాలు పంపితే తమ ప్రయత్నం ఫలించినట్టేనని ఆమె చెప్పారు. స్వేచ్ఛశాట్ విజయవంతమైతే భారీ మాడ్యూల్స్ స్థానంలో అతి చిన్న మాడ్యూల్స్‌ను ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. అలాగే ఎటువంటి కమ్యూనికేషన్ వ్యవస్థ లేని మారుమూల ప్రాంతాలకు ఎంతగానో ఉపయోగమని అన్నారు. వ్యవసాయ రంగంలోనూ సమూల మార్పులకు ఇది దోహదపడుతుందన్నారు.

# రక్షణ పరిశ్రమలో స్వదేశీ సామర్థ్యాల పెంపు

» దేశాభివృద్ధి కోసం సాంకేతిక పురోగతిని సాధించాలి: రాష్ట్రపతి ముర్ము

» కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు 'కలర్స్ ప్రజెంటేషన్ అవార్డు' అందజేత

» రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోమ్.. హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్

అల్వాల్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి): దేశంలో సాంకేతికంగా అధునాతన పరికరాలను తయారు చేయడం ద్వారా రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించే దశను ప్రారంభించే సమయం వచ్చేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. స్వావలంబన, సాంకేతిక పురోగతి, వ్యూహాత్మక సహకారాలపై దృష్టి సారించడం ద్వారా భారతదేశం తన సరిహద్దులను కాపాడుకోవడమే కాకుండా ప్రపంచ శాంతి, స్థిరత్వానికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఈజ్ ఆఫ్ డూయింగ్' వంటి కార్యక్రమాల ద్వారా వ్యాపారం, రక్షణ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి, రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయ, విదేశీ పెట్టుబడుదారులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. స్వదేశీకరణకు ప్రాధాన్యమిస్తూ దేశీయంగా అనేక రక్షణ ఉత్పత్తులు తయారు చేయడం జరుగుతోందన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)కు 'కలర్స్ ప్రజెంటేషన్ అవార్డు' అందజేయడానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రక్షణ పరిశ్రమలో స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. రక్షణ బలగాల అధికారులు ఆత్మనిర్భర్ భారత్ విజన్‌ను సాధించడానికి, స్వావలంబన సాధించడానికి సహకరించాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. రక్షణ ఆధునీకరణ రంగంలో భారతదేశం తన సంప్రదాయాల బలగాలను అప్‌గ్రేడ్ చేయడం, కృత్రిమ మేధస్సు, డ్రోన్‌లు, సైబర్ వార్‌ఫేర్ సామర్థ్యాలు, అంతరిక్ష రక్షణ సాంకేతికతలతో సహా అత్యాధునిక సాంకేతికతలను తెలుసుకోవడం వంటి సమగ్ర విధానంపై, ప్రపంచ స్థాయిలో వ్యూహాత్మక రక్షణ భాగస్వాములను ఏర్పాటుపై భారతదేశం దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. బహుపాక్షిక ఆర్థిక సైనిక దళాల కార్యకలాపాల ద్వారా ప్రాంతీయ, ప్రపంచ రక్షణ చర్చల్లో భారతదేశ ప్రభావం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. గత ఐదు దశాబ్దాలుగా సీడీఎం ప్రయాణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఆమె అభినందించారు. భారత సైన్యం, నేవీ, వైమానిక దళం, కోస్ట్‌గార్డ్‌ల అధికారుల శిక్షణలో ఉన్నత ప్రమాణాలను సాధించడానికి సీడీఎం విశేషంగా కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, కృత్రిమ మేధస్సుకు భారతదేశం అధిక ప్రాధాన్యాన్నిస్తోందని, వాటిని భారత రక్షణ వ్యవస్థల్లో మెరుగైన సామర్థ్యం, ప్రపంచ పోటీతత్వం కోసం ఉపయోగిస్తుందని వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చీఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్, సీడీఎం కమాండెంట్ హర్ష్ చిబ్బర్, త్రివిధ దళాల అధికారులు పాల్గొన్నారు.



ఎట్‌హోమ్ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతో సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

### ముర్ము తేనీటి విందు

శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తేనీటి విందు ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే దంపతులు హాజరయ్యారు. హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావు, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి రాష్ట్ర మంత్రులు దామోదర, పొన్నం, సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తదితరులు రాష్ట్రపతి ఎట్‌హోం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అప్పులపై రాష్ట్రాలకు కేంద్రం స్వేచ్ఛనివ్వాలి

» మూలధన వ్యయంలో రాష్ట్రాలకు ఏటా రూ.2.5 లక్షల కోట్లు ఇవ్వాలి


» జైసల్మేర్‌లో జరిగిన కేంద్ర ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి


హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీసుకునే విషయంలో రాష్ట్రాలకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని, షరతులు, ఆంక్షలను తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన శుక్రవారం రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో జరిగిన కేంద్ర బడ్జెట్ ముందస్తు సమావేశం(ప్రీ బడ్జెట్)లో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే అప్పులు తీసుకోవడంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని భట్టి అన్నారు. రాష్ట్రాల అప్పులపై ఆంక్షలు, షరతులను తొలగించాలని, అప్పుడే అవి ఆర్థిక పరిపుష్టిని సాధిస్తాయన్నారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి, దేశీయ ఆర్థిక మందగమనం వంటి పరిస్థితుల్లో మూలధన వ్యయం విషయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దృష్ట్యా.. మూలధన వ్యయం కింద రాష్ట్రాలకు ప్రత్యేక సహాయంగా ఏటా రూ.2.5 లక్షల కోట్లను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రానికి జనాభా ఆధారంగా సీఎస్ఎస్‌ల నిధులను కేటాయించాలని, ఎలాంటి వివక్ష లేకుండా వెంటనే నిధులను విడుదల చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 లోని సెక్షన్ 94(2) ప్రకారం.. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధి కింద రాష్ట్రానికి రావాల్సిన రూ.1800 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ పథకాన్ని మరో ఐదేళ్ల పాటు కొనసాగించాలని కోరారు. దేశ పన్నుల వ్యవస్థను సరళీకృతం చేయాలని, ముఖ్యంగా ఆదాయ పన్నులో సంస్కరణలు చేపట్టాలని అన్నారు. జీఎస్టీ, ఐటీ రిటర్నుల దాఖలు ప్రక్రియను సులభతరం చేయాలని, పారిశ్రామిక శిక్షణ సంస్థల(ఐటీఐ) ద్వారా కృత్రిమ మేధ(ఏఐ), ఎలక్ట్రానిక్స్ వంటి ఆధునిక కోర్సులను అందిస్తూ, యువతలో నైపుణ్యాన్ని పెంచాలని అన్నారు. గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు జాతీయ స్థాయి విధానాన్ని తీసుకురావాలన్నారు.

# ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నేడు ప్రపంచ ధ్యాన దినోత్సవం

యోగా, ధ్యానంపై దృష్టి పెట్టాలంటున్న గురువులు





#### మానసికోల్లాసం కోసం..

యోగా, ధ్యానాల గురించి తెలియని వారు కూడా ఇంకా ఉన్నారని, దీనిని ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పి అందరికీ అవగాహన కల్పించడం గొప్ప సంకల్పమని ఐక్యరాజ్య సమితి అభిప్రాయ పడింది. యోగా అనేది శారీరానికి ఉల్లాసాన్ని ఇస్తే.. ధ్యానం అనేది మనస్సుకు ఉల్లాసాన్ని ఇస్తుంది. ఈ రెండింటినీ నిపుణులు ధ్రువీకరించారు. ఈ సాధనాలు అత్యంత అవసరమని గుర్తించారు. ఇవి శరీర భంగిమ, వశ్యత, సత్తువ, ఏకగ్రతలను మెరుగుపరుస్తుందని యోగా గురువులు చెబుతున్నారు.

#### అంతర్జాతీయ స్థాయిలో ధ్యాన దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా ధ్యాన దినోత్సవాన్ని జరిపేందుకు ఐక్యరాజ్య సమితి డిసెంబరు 21వ తేదీని ఖరారు చేసింది. ఈ క్రమంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని శనివారం జరుపనున్నారు. ప్రతి మనిషి దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నారంటే.. అది కేవలం మానసికంగా బాగా లేకపోవడం వల్లనేనని మానసిక వైద్యులు, శాస్త్రవేత్తలు, యోగా గురువులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మానసిక బాధలను జయించడానికి ఏకైక సాధనం యోగా ధ్యానాలేనని చెబుతున్నారు. అందుకే ఈ రెండింటికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చింది. వాటికి ప్రత్యేక రోజును కేటాయించారు. ఈ రెండూ నిత్యం చేస్తే ప్రతి మనిషి ఆరోగ్యంగా జీవిస్తారని చెబుతున్నారు.

#### యోగా, ధ్యానాలతో ప్రయోజనాలు..

మనస్సును, శరీరాన్ని సమన్వయం చేయడం, స్థూల శరీరం.. సూక్ష్మ శరీరాన్ని అనుసందానం చేయడం. ఇంకా లోతుగా చెప్పాలంటే... జీవాత్మను పరమాత్మలో కలపడమే యోగంగా యోగా గురువులు అభివర్ణిస్తున్నారు. యోగా ధ్యానాలతో అనేక ప్రయోజనాలున్నాయని చెబుతున్నారు. శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుకు ఎంతగానో దోహద పడుతుందని, దీర్ఘకాలిక వ్యాదులైన మధుమోహం, రక్తపోటు వంటి వాటి నుంచి ప్రమాదం లేకుండా చేస్తుందని చెబుతున్నారు. యోగా, ధ్యానాలతో మానసిక సమస్యలు కూడా తొలిగిపోతాయని అంటున్నారు. యోగా ద్వారా మనోధైర్యాన్ని పెంపొందించుకోవచ్చని, తద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గురువులు చెబుతున్నారు. వైద్యశాస్త్రంలో అంతుచిక్కని వ్యాదులు సైతం యోగాధ్యానాల ద్వారా నయమైన సందర్భాలు లేకపోలేదని స్పష్టం చేస్తున్నారు.

భూపాలపల్లి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోట్లు సంపాదించినా.. ఆరోగ్యం గా లేక పోతే అన్నీ కోల్పోయినట్లే నని అం టారు పెద్దలు. ఇది అక్షర సత్యమని అంటున్నారు నిపుణులు. అందుకే ఆరోగ్యమే... మహాభాగ్యం అన్నారు పెద్దలు. యోగా గురువులు కూడా ఆరోగ్యాన్ని మించిన సంపద లేదని బోధిస్తూనేఉన్నారు. ఎంత సంపాదించినా కూటికే.. చివరకు వెళ్లేది కాటికే... రెండింటి మధ్య మన జీవితం ఆరోగ్యంగా ఉండటమనేది ఎంతో ముఖ్యమని కూడా చెప్పారు మహర్షులు. ఇదే స్ఫూర్తితో యునైటెడ్ నేషన్స్ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించింది. ఇప్పుడు కొత్తగా ధ్యాన దినోత్సవాన్ని సైతం అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా ఓ రోజు ఉండాలని డిసెంబరు 21ని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ధ్యాన దినోత్సవంగా గుర్తించింది.

#### తప్పకుండా పాటిస్తేనే ఫలితాలు



యోగా శారీరానికి, మనస్సుకు ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుంది. దీని ద్వారా అనేక రోగాలు నయమవుతాయి. తు.చ. తప్పకుండా పాటిస్తేనే ఫలితాలు కనిపిస్తాయి. అలాగే శాఖాహార భోజనం భుజిస్తే ఇంకా మంచిది. యోగా గురువుల వద్ద శిక్షణ పొంది, రెగ్యులర్ సాధన చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి. జీవితాన్ని సవ్యంగా నడుపుకోవచ్చు. వర్షకాలం, శీతాకాలంలో వాతావరణ తీవ్రతను తట్టుకోవడానికి ఈ యోగా ఎంతగానో ఉపయోగపడుతుంది.

\- చెరుకుపల్లి రవీందర్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్, భూపాలపల్లి

#### యోగాధ్యానాలతో జీవితం సార్థకం



ప్రతీ మనిషి యోగా ధ్యానాలు చేస్తే జీవితం సార్థకమవుతుంది. మానసిక రుగ్మతలనే కాకుండా జీవితంలో తలెత్తుతున్న సమస్యలను సైతం సునాయసంగా పరిష్కరించగలిగే శక్తి వస్తుంది. ఇది ప్రయోగాత్మకంగా చేస్తేనే ఫలితం ఉంటుంది.

\- యాసోజు మాధవాచారి, శ్రీపరివార్ యోగాచార్యులు భూపాలపల్లి

# 'భూభారతి'కి.. సర్వే సంకటం!

(3వ పేజీ తరువాయి)

ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని సర్వే, రికార్డు కార్యాలయాల్లో 83మంది విధులు నిర్వంచాల్సి ఉండగా, కేవలం 44మంది మాత్రమే ఉన్నారు. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు జిల్లాలో సర్వే ల్యాండ్ రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) కార్యాలయంలో పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ఏడీ, సూపరింటెండెంట్‌తో పాటు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, డ్రాఫ్ట్‌మెన్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు నుంచి చివరకు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏడీ, సూపరెంటెండెంట్లు మాత్రమే భూపాలపల్లి నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి ములుగు జిల్లాలో పని చేస్తున్నారు. దీంతో సర్వే, రికార్డు కార్యాలయాల్లో ఏం జరుగుతుందో ఎవరికి తెలియటం లేదనే విమర్శలున్నాయి. అలాగే మహ బూబాబాద్ జిల్లాలో ఏడీ కార్యాలయంలో ఇద్దరు సర్వేయర్లు, ముగ్గురు డిప్యూటీ సర్వేయర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వరంగల్ జిల్లా ఏడీ కార్యాలయంలో ఎనిమిది మంది విధులు నిర్వహించాల్సి ఉండగా, పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. డిప్యూటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. జనగామ జిల్లాలో మొత్తం 14పోస్టులకు సగం ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లాలో 15మంది ఉండాల్సి ఉండగా, 8మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లా ఏడీ కార్యాలయంలో 21మంది ఉండాల్సి ఉండగా 14మంది పని చేస్తున్నారు. మరో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కీలకమైన ఏడీ కార్యాలయాల్లోనే సర్వేయర్ల కొరత ఉండటంతో అన్ని జిల్లాల్లో భూముల కొలతలో పాటు ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూసేకరణ, మైనింగ్ తదితర పనులకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా సర్వేయర్లను తీసుకుంటామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించినప్పటికీ, ఎప్పటిలోగా రిక్రూట్‌మెంట్ పూర్తి చేస్తారో అనేది ఉత్కంఠగా మారింది. మొత్తానికి ఇప్పటికే సర్వేయర్ల కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కొత్తగా తీసుకవచ్చిన భూభారతితో భూక్రయవిక్రయాలకు ముందే.. భూముల సర్వే చేస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తారని పేర్కొనటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

#### సర్వేయర్ల కొరత తీరుతుందా?

రాష్ట్రవ్యాప్తంగా సర్వేయర్ల కొరత ఉన్న నేపథ్యంలో.. భూభారతి అమలుకు అడ్డంకులు లేకుండా చూసేందుకుగాను వెయ్యి మందిని సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లుగా నియమించబోతున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఆయన ప్రకటనతో ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో ఉన్న సర్వేయర్ల కొరత తీరుతుందని ఆశిస్తున్నారు. ఈ నియామకాలతో భూభారతి అమలు, భూముల రిజిస్ట్రేషన్లకు ముందు జరిగే ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు ఉండవని భావిస్తున్నారు.

# నేడు అతిపొడవైన రాత్రి!


మధ్యాహ్నం 2.49గంటల నుంచే వెలుతురు తగ్గుతుందట

ఖగోళంలో అరుదైన ఆవిష్కరణపై సర్వత్రా చర్చ

మహబూబాబాద్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : 2024 ఏడాది చివరాంకాన.. శనివారం ఖగోళంలో అరుదైన ఆవిష్కరణ చోటు చేసుకోబోతోందని, శనివారం అతిపొడవైన రాత్రి ఉండబోతోందని, మధ్యాహ్నం 2:49 గంటల నుంచే సూర్యుడి వెలుగు తగ్గి చీకటివైపు పయని స్తుందని కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో సమాచారం చక్కర్లు కొడుతోంది. దీంతో శనివారం ఏం జరగబోతోం దనే దానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. శాస్త్రజ్ఞుల అంచ నాల మేరకు ఈ అరుదైన అయనాంతం దేనికి సంకేతమ నే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విజ్ఞానశాస్త్రంపై ఆసక్తి కలిగిన విద్యార్థి, యువతతో పాటు పెద్దవారు సైతం తమకు తెలిసిన శాస్త్రవేత్తలు, సైన్స్ కమ్యూని కేటర్లను సంప్రదిస్తున్నారు. అయితే అంతరిక్షంలోకి అడుగులు వేస్తూ అనేక ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ఇది కాలానుగుణంగా జరిగే సహజ అంశమే అని కొందరు విజ్ఞానవంతులు కొట్టిపారేస్తున్నారు. దీంతో సుదీర్ఘకాలం కిందట స్కైలాబ్, ఇతరత్రా శకలాలపై వచ్చి న ఊహాగానాలను గుర్తుచేసుకుంటున్నారు. ఏదేమైనా శీతాకాలంలో ఏర్పడుతున్న ఈ ఆవిష్కరణను శీతాకాలపు అయనాంతంగా పేర్కొంటారని సైన్స్ పరిశోధకులు అంటున్నారు. అసలు ఈ ఆవిష్కరణ ఏంటి? అయనాం తం అంటే ఏంటి? శనివారం ఏం జరగబోతోందనే విష యాలను తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' మహబూబా బాద్ జిల్లా సైన్స్ కమ్యూనికేటర్ పూరె గురునాథరావును సంప్రదించింది. ఆయన తెలిపిన పలు వివరాలు..

#### మధ్యాహ్నం 2.49 గంటల నుంచి..

సోల్స్టిస్ సమయం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం 2.49 గంటల నుంచి భూమి సూర్యుడి మధ్య వ్యత్యాసం పెరగడంతో చీకటి ప్రారంభమై వెలుతురు తగ్గిపోతుందని సైన్స్ కమ్యూనికేటర్ గురునాథరావు చెబుతున్నారు. సోల్స్టిస్ అనేది భూగోళం అక్షంపై భూగ్రహం ప్రయాణిస్తున్నప్పుడు సూర్యుడు ఆ దిశలో అత్యంత దూరంగా లేదా.. దగ్గరగా ఉండే క్షణాన్ని సూచిస్తుందని, ఇది సూర్యుడి కిరణాలు భూమి మధ్య కోణాన్ని ప్రభావితం చేస్తుందని, ఫలితంగా వార్షిక కాల సీజన్‌ల మార్పులు జరుగుతాయని ఆయన తెలిపారు. దక్షిణగోళంలో అత్యం త దూరంగా ప్రయాణించే సూర్యుడు మన దేశ సమయం ప్రకారం శనివారం మధ్యాహ్నం 2.49గంటలకు దిశాబద్ధంగా దూరమవడం ప్రారంభమవుతుందని, సమ్మర్ సోల్స్టిస్ ప్రకారం.. ఉత్తరగోళంలో అత్యంత దగ్గరగా.. దక్షిణగోళంలో అత్యంత దూరంగా ఉంటాడన్నాడు. ఈ క్రమంలో ఉత్తరగోళంలో వేసవికాలం ప్రారంభమైతే.. దక్షిణగోళంలో శీతాకాలం ప్రారంభమవుతుందన్నారు. వింటర్ సోల్స్టిస్ ప్రకారం.. సూర్యుడు దక్షిణగోళంలో మరింత కాంతిని ప్రసరించడాన్ని సూచిస్తుంది. దీంతో ఉత్తరగోళంలో అత్యంత చిన్నరోజు అంటే చిన్న ఉదయం.. ఎక్కువ రాత్రి ఉంటుందని తెలిపారు. ఇక ఈ ఏడాది డిసెంబర్ 21న శీతాకాల సూర్యాయనం చోటు చేసుకుంటుందని, ఇది ఉత్తరగోళంలో అతిచిన్న రోజుగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఇదేరోజు అతిపొడవైన రాత్రిని కూడా చూడగలుగుతామని, భూమి అక్షం తన 23.5 డిగ్రీల కోణంలో తిరుగుతుండగా.. ప్రకృతిపరంగా ఒక అందమైన శక్తివంతమైన మార్పును చూపుతుందన్నారు. ఏదేమైనా నేటి శీతాకాలపు అయనాంతాన్ని ఆస్వాదించాలని ప్రతీ ఒక్కరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.





సూర్యుడి చుట్టు భూ పరిభ్రమణ దృశ్యాలు (ఫైల్)



గురునాథరావు

# బ్రాహ్మణులు ఐక్యతతో ముందుకు సాగాలి

**● టీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ**



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న జగన్మోహన్‌శర్మ

మహబూబాబాద్‌టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణులంతా ఐక్యతతో ముందుకు సాగాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (టీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్మోహన్‌శర్మ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శివాలయం ఆవరణలో శుక్రవారం సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని సుధాకరశాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ పరిషత్ ద్వారా బ్రాహ్మణులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సభ్యత్వ నమోదును పెంచుకుని త్వరలో జరిగే రాష్ట్ర మహాసభకు ప్రతీ ఒక్కరు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

త్వరలో మహబూబాబాద్ జిల్లా బ్రాహ్మణ సమ్మేళనాన్ని నిర్వహించాలని, పెద్దఎత్తున బ్రాహ్మణులు హాజరయ్యేలా ప్రణాళికలు రచించాలని జగన్మోహన్‌శర్మ సూచించారు. అనంతరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అఖిల భారత బ్రాహ్మణ ఫేడరేషన్ కోశాధికారి కొండపల్లి కేశవరావు, దేవులపల్లి వాణి, రాము, కిరణ్, దిట్టకవి సుబ్రహ్మణ్యం, కల్లూరి ప్రభాకర్, రామచంద్రారావు, గుడి రాధకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కంటి ఆస్పత్రుల్లో డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీలు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి, సూర్య కంటి ఆస్పత్రులను శుక్రవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ప్రమీలరావ్ తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిని శుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రీవెన్స్‌సెల్‌కు వచ్చిన నాలుగు దరఖాస్తుల ఆధారంగా వాటికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. సదరు నాలుగు కేసులకు సంబంధించిన వివరాలు, ఆపరేషన్ సర్టిఫికెట్లను సమర్పించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సూచించారు. ఆస్పత్రుల్లో పనిచేసే వైద్యుల సర్టిఫికెట్లను, మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను వైద్యశాఖ కార్యాలయంలో ఇవ్వాలని చెప్పారు. సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ గీత, డాక్టర్ సుధీర్‌కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పిల్లి గోవర్ధన్ పాల్గొన్నారు.

# కక్ష పూరిత ధోరణితోనే కేటీఆర్‌పై కేసులు

**● ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల ఆరోపణ**



మహబూబాబాద్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎలాంటి అక్రమాలకు పాల్పడకున్న సీఎం రేవంత్‌రెడ్డి కక్షపూరిత ధోరణిని అవలంభిస్తూ కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించారని మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్ఎస్ యూత్ అర్బన్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేలా మాజీ మంత్రి కేటీఆర్ ఈ-రేస్‌ను తీసుకువస్తే అందులో అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు బనాయించడం సరికాదన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు కేటీఆర్ కృషి చేస్తే దానిని దెబ్బతీయడానికి కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కారు ఈ-రేస్ నిర్వాహకుడి కంపెనీకి రూ.50 కోట్లు నాటి ప్రభుత్వం చెల్లిస్తే వాటిని కేటీఆర్ కాజేసినట్లుగ చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయంలో హైదరాబాద్‌ను ప్రధాన నగరాలకు ధీటుగా అభివృద్ధి చేశారని, అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలుచుకుందని చెప్పారు. ఇప్పటికైనా మాజీ మంత్రి కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే ఎత్తివేయాలన్నారు.

కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్ పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, ముత్యం వెంకన్న, మార్నేని రఘు, ఆవుల వెంకన్న, లూనావత్ అశోక్‌నాయక్, కర్పూరపు గోపి, డౌలాగర్ శంకర్ పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలిస్తున్న లెనిన్‌వత్సల్‌టొప్పో

## సర్వేను వేగవంతం చేయాలి

**● అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో**

నెల్లికుదురు డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇండ్ల సర్వేను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో తెలిపారు. నెల్లికుదురులో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. అలాగే ఎస్సీ హాస్టల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించారు. బియ్యం వంటసామగ్రిని,రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంఅందించాలని నిర్వాహకులకు సూచించారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీవో బాలరాజు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

**● జిల్లా వైద్యాధికారి మురళీధర్**

తొర్రూరు, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్యులు అందుబాటులో ఉండి, ప్రజలకు సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి మురళీధర్ అన్నారు. శుక్రవారం తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేసి, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు సత్వరమే అందించాలని, స్థానికంగా ఉండని వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది ముందస్తు క్రిస్టమస్ వేడుకలు చేపట్టడంతో కేక్ కట్‌చేసి వేడుకలు ప్రారంభించారు. వైద్యులు సుగుణాకర్ రాజు, రమేష్, శంకర్, జ్వలిత, లక్ష్మీనారాయణ, ప్రమీలరావు, సుధీర్ రెడ్డి, సారంగపాణి, వనాకర్ రెడ్డి, ప్రియాంక, మానస, వైద్య సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

## కీర్తిప్రతిష్టలకు భంగం కలిగించొద్దు

**● డీఎస్పీ కృష్ణకిషోర్**



పోలీస్‌స్టేషన్‌లో పీసీలతో మాట్లాడుతున్న కృష్ణకిషోర్

దంతాలపల్లి, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది, ఇతర అధికారులు కీర్తి ప్రతిష్టలకు భంగం కలిగించొద్దని డీఎస్పీ కృష్ణకిషోర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి 17 గ్రామాల వీపీవోలతో సమావేశమై సమస్యాత్మక గ్రామాల స్థితిగతులపై ఆరాతీశారు. మండలం గుండా ప్రభుత్వ నిషేధిత గుడుంబా, బెల్లం, పటిక, ఇసుకఅక్రమ రవాణాపై ప్రత్యేక నజర్ ఉంచాలన్నారు. రౌడీషీటర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఐ జగదీష్, ఎస్సై రాజు, ఏఎస్సై చందర్ డ్యూటీలో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన జన్నయ్య, స్వాతి, గణేష్‌లకు రివార్డులు అందించి, అభినందించారు.

## 'సభను జయప్రదం చేయండి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు20(ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో తలపెట్టిన కాకతీ కదనభేరి సభను జయప్రదం చేయాలని మహబూబాబాద్ జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో న్యాయశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో శుక్రవారం కాకతీ కదన భేరి సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు నాయకులు రవి ,ఎమ్డీ.రఫిక్, నాగముణి, ముబిన్‌అహ్మద్, వీరన్న, శ్రీనివాస్, ఆహ్మద్ ఖాన్, అనిల్‌కుమార్, వెంకన్న, వెంకటేశ్, సత్యనారాయణ, ఎంజె.రెడ్డి, శైలజ, వీరలక్ష్మీ, ఝాన్సీ భవాని, రుచిత, మురళి పాల్గొన్నారు.

## ఎస్పీని కలిసిన హెడ్ కానిస్టేబుల్



ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను మర్యాదపూర్వకంగా కలుస్తున్న హెడ్ కానిస్టేబుల్ సోమేశ్వర్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 20 : జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌ను డోర్నకల్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పోలోజు సోమేశ్వర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సోమేశ్వర్ కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందని చెప్పారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ సర్వీస్‌లో మరెన్నో పదోన్నతులు పొందుతూ.. జిల్లాకు, వ్యక్తిగతంగా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

# కొనసాగుతున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడలు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సీఎం కప్-2024 జిల్లా స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. తొలి రోజు గురువారం జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ క్రీడలను ప్రారంభించగా కబడ్డీ, వాలీబాల్ క్రీడలను పూర్తి చేశారు. కబడ్డీ బాలుర, బాలికల విభాగాల్లో ప్రథమ స్థానంలో కొత్తగూడ, ద్వితీయ స్థానంలో తొర్రూరు మండలాల జట్లు నిలిచాయి. వాలీబాల్ బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో కొత్తగూడ, ద్వితీయ స్థానంలో మహబూబాబాద్, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో తొర్రూరు, ద్వితీయ స్థానంలో కొత్తగూడ మండలం జట్లు నిలిచినట్లు అధికారులు తెలిపారు.

రెండవ రోజు ఖోఖో, త్రైక్వాండో, కరాటే, యోగా, చెస్ క్రీడలను నిర్వహించారు. క్రీడా పోటీల్లో అన్ని మండలాల నుంచి వచ్చిన క్రీడా జట్లు గెలుపు కోసం హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి జ్యోతి, పీఈటీలు కొమ్ము రాజేందర్, శంకర్‌నాయక్, శ్రీనివాస్, జక్కి నాగేష్, వీరునాయక్, పుష్పలీల తదితరులు పాల్గొన్నారు.



ఖోఖో క్రీడలో తలపడుతున్న మరిపెడ, కేసముద్రం జట్లు

## డబుల్ బెడ్‌రూముల్లో వసతులు కరువు : సీపీఎం

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు20 (ఆంధ్రజ్యోతి) : గత బీఆర్ఎస్ హాయంలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద వసతులులేక ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. ప్రజాసమస్యల అధ్యయనం కోసం సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి సర్వేలో భాగంగా డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీని సందర్శించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మిషన్ భగీరథ నీళ్లు సరిపోక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రోడ్లు లేక వర్షంవస్తే నరక యాతన పడుతున్నారని చెప్పారు. సమ్మెట రాజమౌళి, రావుల రాజు, ఎస్కే. ముకరంజన్, మేకల వీరేష్, ఉపేందర్, బాబు, శ్రీను పాల్గొన్నారు.



గూడూరు సొసైటీలో రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ చల్లా లింగారెడ్డి

## యూరియాకు కొరత లేదు

గూడూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహాకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో రైతులకు అందుబాటులో యూరియా ఉందని సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి అన్నారు. గూడూరు సొసైటీలో శుక్రవారం రైతులతో ఆయన మాట్లాడారు. రబీ సాగులో రైతులకు అవసరమైనంత యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏజెన్సీ రైతులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. చల్లా వెంకట్‌రెడ్డి, అన్న వెంకన్న, బొల్లికొండ సుధాకర్, లావుడ్య సురేష్ ఉన్నారు.

## శిథిలమైన మార్కెట్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన చైర్మన్, వైస్ చైర్మన్

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని మార్కెట్ కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థ చేరుకోవడంతో.. ఆ భవనాన్ని శుక్రవారం చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్‌చైర్మన్ మదన్‌గోపాల్‌లోయా పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయ భవనం పైకప్పు పూర్తిగా శిథిలమై, కూలిపోవడంతో పక్కనే ఉన్న డీఎంవో కార్యాలయంలోకి మార్చారు. ఈ భవనం సుమారు నలభై ఐదు సంవత్సరాల కిందట నిర్మించారు. దాంతో పాటు రైతుల విశ్రాంతిభవనం, దడువాయిల విశ్రాంతి భవనం కూడా పైకప్పులు శిథిలమై కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. ఈ భవనాలను మార్కెట్ కార్యాలయ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ పరిశీలించి, పాలకమండలి సభ్యుల సమావేశంలో చర్చించి ఎమ్మెల్యేలు జాటోత్ రాంచందర్‌నాయక్, భూక్య మురళీనాయక్,మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్ దృష్టికి తీసుకువెళ్లి కొత్త కార్యాలయ భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. నూతన కార్యాలయ బిల్డింగ్ కోసం నిధులు సాధించేందుకు తీవ్రమైన కృషి చేస్తామని, మార్కెట్ అభివృద్ధికి పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి శంషీర్, సూపర్‌వైజర్ రమేష్ పాల్గొన్నారు.

## పోలీసుల చొరవతో సజావుగా పనులు

ఇనుగుర్తి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాముతండా జీపీ పరిధిలోని వీరారెడ్డిపల్లి నుంచి రూప్లాతండాకు నూతన బీటీరోడ్డు నిర్మాణ పనులను వీరారెడ్డిపల్లికి చెందిన ఓ వ్యక్తి అడ్డుకున్నాడు. నీళ్ల వెళ్లే పైపులను తన పొలం వైపు వేస్తున్నారని ఆరోపిస్తూ నాలుగు రోజుల క్రితం ఈ పనులను నిలిపివేయించాడు. పలువురు గ్రామస్థులు తహసీల్దార్, ఎస్ఐలకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకొని యథావిధిగా రోడ్డు నిర్మాణ పనులను చేయించారు.

## 'పట్టణాభివృద్ధి కోసం కృషి'

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. 24వ వార్డు పరిధి లెనిన్‌నగర్‌కాలనీ మునిసిపల్ సాధారణ నిధులు రూ.5లక్షలతో నిర్మించతలపెట్టిన సైడ్ కాల్వ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా మునిసిపల్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కిరణ్‌కుమార్, పిట్టల గోపాల్, వద్ది నాగయ్య, సీహెచ్. సత్యనారాయణ, కిషోర్‌రెడ్డి, దొంతరబోయిన మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 'ఏజెన్సీ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి'

గూడూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వంలో గూడూరు ఏజెన్సీ మండల అభివృద్ధి కోసం మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కృషి చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా నేత మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి అన్నారు. గూడూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్‌చందర్‌రెడ్డి మాట్లాడారు. గూడూరు మండల అభివృద్ధి దిశగా నివేదికలను సిద్ధం చేసినట్లు చెప్పారు. గూడూరు నుంచి బొల్లెపల్లి వరకు ఫోర్‌లైన్స్ రహదారి, గోవిందాపురంలో పీహెచ్‌సీ, పెనుగొండ-లక్ష్మీపురం క్రాస్ వరకు రహదారి మంజూరు, లక్ష్మపురం క్రాస్ నుంచి అర్పనపల్లి వరకు రోడ్డు మంజూరు అయినట్లు చెప్పారు. గూడూరు మండలంలోని సమస్యలను అసెంబ్లీలో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ప్రస్తావించడం పట్ల ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు ప్రదీప్‌రెడ్డి, చిట్టి వెంకటేశ్వర్లు, బోయినపల్లి సతీష్‌రావు, వాంకుడోతు కొమ్మాలు, చంటిస్వామి, సమ్మెట శ్రీనివాస్, గంగయ్య, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వైద్యశాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ కోరారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ తహసీల్ కార్యాలయంలో ఎదుట తెలంగాణ వైద్యఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు చేపట్టిన (48 గంటల) నిరసన దీక్ష శుక్రవారం ముగిసింది. ఈ దీక్షలో జ్యోతి, వనిత, సువర్ణ, పద్మ, పార్వతి, సమ్మక్క, సునిత, సరిత, విజయ, శోభ, నసీమా, సుమలత, భద్రమ్మ పాల్గొన్నారు.

## నేడు విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

డోర్నకల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందించనున్నట్లు హెచ్‌ఎం బండి నర్సింహారావు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు చెప్పారు.

## నేడు ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

డోర్నకల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక కోసం శనివారం డోర్నకల్‌లోని కేథిడ్రల్ గ్రౌండ్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఓలేటి జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ క్రీడల్లో చూపిన ప్రతిభ ఆధారంగా జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎం పికైన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాజట్టు తరుపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

## బీజేపీ బూత్ అధ్యక్షుల నియామకం



బీజేపీ బూత్ అధ్యక్షులకు నియామకపత్రాలు అందిస్తున్న చీకటి మహేష్‌గౌడ్

కురవి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బూత్‌స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని మండల సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జ్ చీకటి మహేష్ అన్నారు. కురవిలో పలు గ్రామాల బూత్ అధ్యక్షులకు శుక్రవారం నియామకపత్రాలు అందించారు. కొత్తూరు (జి) ఇన్‌చార్జ్‌గా మాలోతు వెంకన్న, బంచరాయితండ లూనావత్ శ్రీను, నల్లెల్ల శేషగాని సరిత, తాట్యతండ తేజావత్ వెంకన్న, స్టేషన్ గుండ్రాతిమడుగు ఇస్లావత్ వీరన్నలకు నియామకపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్వీఎన్ రాజు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ పెంటయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు మారినా.. పాలకుల విధానాలు మారలేదు

**టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్**

గార్ల డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా పాలక ప్రభుత్వ విధానాలు మాత్రం మారలేదని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం గార్ల వర్తక సంఘం భవనం న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జడ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, మురళీకృష్ణ, దేవేందర్, గట్టి కృష్ణ, ఆడిపయ్య, బొమ్మిడి నరింగ్, పాక వెంకన్న, శంకర్, గౌని మల్లేశ్, గౌని భద్రయ్య, బజారయ్య పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధురాలు మృతి



వీరలక్ష్మి (ఫైల్)

కొత్తగూడ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శతాధిక వృద్ధురాలు పూల వీరలక్ష్మి (100) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొత్తగూడకు చెందిన మాజీవైస్ ఎంపీపీ పూల యాదగిరి తల్లి పూల వీరలక్ష్మి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. శుక్రవారం మృతి చెందారు. వీరలక్ష్మి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరలక్ష్మి నాలుగుతరాలు చూసినట్లు తెలిపారు. మనవరాళ్లకు మనవరాళ్లు ఉన్నారు.

## కిసాన్ కార్డును వినియోగించుకోవాలి

మరిపెడ రూరల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పశు సంపద కలిగిన ప్రతీ రైతుకు రూ.1.60 లక్షల వరకు సెక్యూరిటీ లేకుండా కిసాన్ క్రెడిట్ కార్డుద్వారా బ్యాంక్ రుణాలు పొందవచ్చని పశువైద్యాధికారి హెచ్.మనోహర్ కృష్ణకుమార్ తెలిపారు. శుక్రవారం ఎడ్జర్ల పశువైద్య కేంద్రంలో మాట్లాడారు. ఈ రుణం పొందాలంటే రైతులకు పాడిపశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులై ఉండాలన్నారు. ఈ డబ్బును పశువుల పెంపకానికి, ప్రతీ నిత్యం వాటిని మేపడానికి మేపు, మందులు తదితర ఖర్చులకు మాత్రమే వినియోగించాలన్నారు. ఈ రుణానికి 7శాతం వడ్డీ ఉంటుందన్నారు. రైతులు వాడుకున్న మొత్తానికి ఆలస్యం చేయకుండా చెల్లించినట్లయితే వడ్డీ రాయితీ లభిస్తోందన్నారు. రైతులు పశుగణనకు సహకరించాలన్నారు.

## కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పెద్దవంగర, డిసెంబర్20 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా నాయకుడు సుంకనేని కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొరిపెల్లి, చిట్యాల గ్రామాల్లో మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన సుధాకర్, మాజీ ఎంపీటీసీ రహీమ్‌వోద్దీన్ ఆధ్వర్యంలో బీజేపీ బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచ దేశాల సరసన అగ్రగామిగా నిలబడిందని కొనియాడారు. బీజేపీ నాయకులు దేశెట్టి వెంకటనారాయణ, అన్వేష్, పవన్, శ్యామ్, ఎర్ర ప్రకాష్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గార్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ సిఫార్సు మేరకు మంజూరు అయిన చెక్కులను లబ్ధిదారుల కుటుంబసభ్యులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధనియాకుల రామారావు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు యాకుబ్ పాషా, బాబులాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం తొర్రూరులో ఆ సంఘం 6వ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి, ఆయన మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేసి మినిమం బేసిక్ పే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారం, విద్యారంగ బలోపేతం, ఉపాధ్యాయ రంగ సమస్యలపై చర్చించేందుకు డిసెంబరు 28, 29, 30 తేదీల్లో నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగే సంఘం 6వ రాష్ట్ర మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు నాగమల్లయ్య, రమేష్, యాకేందర్, నారాయణ, పార్వతి, రంజిత్, జనార్దన్, మౌనిక, మమత, పల్లవి ఉన్నారు.

## సమాజసేవలో భాగస్వాములు కావాలి

**జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి**

పెద్దవంగర, డిసెంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమవంతు సహాయ సహకారాలు అందిం చే తత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన హైదరాబాద్ వెల్త్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి శ్రీను-చైతన్య దంపతుల కుమార్తె ఖుషి జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.75వేలు విలువ చేసే ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్, పరీక్ష సామగ్రితో పాటు పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ చదివిన పాఠశాలలోని విద్యార్థులకు తమ వంతు సాయం అందించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన సుంకరి శ్రీను-చైతన్య దంపతులను అభినందించారు. ఎంపీడీవో వేణుమాధవ్, ఎంఈవోలు బుదారపు శ్రీనివాస్, మహంకాళి బుచ్చయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఉప్పలయ్య, అంజయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు సరికాదు

తొర్రూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం పిలుపు మేరకు వెళ్తున్న నాయకులను అక్రమ అరెస్టులు చేయడం సరికాదని ఏఐ ఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బందు మహేందర్ అన్నారు. శుక్రవారం మహేందర్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నేపథ్యంలో పోలీసులు ఇండ్ల వద్దకు వచ్చి అరెస్టులు చేయడం సరికాదని, ఇదెక్కడి ప్రజాపాలన అని ఎద్దేవా చేశారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, వెంటనే అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలన్నారు.

## విష్ణు కుటుంబానికి ఆర్థికసాయం

నర్సింహులపేట, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నర్సంపేట మాదన్న చెరువులో కారుపడిన ఘటనలో మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏఈవో విష్ణు కుటుంబానికి జిల్లా వ్యవసాయ అధికారుల బృందం శుక్రవారం ఆర్థికసాయం అందించారు. ఈనెల 11న ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొని మాదన్న చెరువులో ప్రమాదశాత్తు కారు పడిపోవడంతో నర్సింహులపేటకు చెందిన విష్ణు మృతి చెందాడు. ఇందులో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు కొంత నగదు పొగుచేసి రూ.3.57 లక్షల నగదును మృతుడు విష్ణు తల్లిదండ్రులకు చెక్కు రూపంలో అందించారు. అనంతరం విష్ణు మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల వంటావార్పు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో చేస్తున్న సమ్మె శిబిరం వద్ద శుక్రవారం 14వ రోజు వంటావార్పు నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు వీరన్న, కల్పన మాట్లాడుతూ ఈనెల 6 నుంచి ఎస్ఎస్ఏ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్‌తో నిరవధికంగా సమ్మె చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా చిరు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. ఎమ్మార్సీ, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే కేజీబీవీల్లో టీచింగ్ సిబ్బందితోపాటు బోధనేతర సిబ్బంది మొత్తం కూడా విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. సమ్మెకు పీఆర్‌టీయూ-టీఎస్ తొర్రూరు శాఖ బాధ్యులు సంఘీభావం ప్రకటించారు. మంజుల, నవీన్, ప్రభాకర్, ప్రభావతి, కవిత, అరుణ, ఉమ, విజయలక్ష్మీ, రేణుక, రవీందర్, బాబులాల్, వీరస్వామి పాల్గొన్నారు.